# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# మార్పు భలే ఉందిగా!



దంటు కనకదుర్గ
89772 43484

**2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన వెయ్యి అబద్ధాల కంటే ప్రభావవంతంగా పనిచేసిన నినాదం 'మార్పు'. దీని ప్రభావం నగరాల్లో పని చేయలేదు, ఎందుకంటే విద్యావంతులైన ఓటర్లు ఆ మార్పును వర్తమాన, గత ప్రభుత్వాల తీరుతెన్నులు పక్కపక్కనే పెట్టి చూడగలిగారు. అమాయకులైన పల్లె ప్రజలు మార్పు అంటే తమకు ఇప్పటికంటే ఎక్కువ లాభం జరుగుతుందని భ్రమపడి కాంగ్రెస్‌ను గెలిపించారు. వారి ఆలోచనలో కేసీఆర్ ఇస్తున్న సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పథకాలు జత కలుస్తాయని అనుకున్నారు. ఇంగ్లిష్ భాషలో 'మార్పు' వంటి తటస్థ పదాలకు ఒక విశేషణం తగిలిస్తారు. అర్థం సరిగా ఉండటానికి 'ఛేంజ్ ఫర్ గుడ్' లేదా 'ఛేంజ్ ఫర్ బ్యాడ్' అని అంటారు. కానీ, ఉత్తగా మార్పు అంటే అదేమైనా కావచ్చు. కాంగ్రెస్ పాలన మొదలై మొదటి మాసికం మరో రెండు రోజుల్లో పూర్తవుతుంది కాబట్టి, ఈ మార్పులు ఎక్కడెక్కడ వచ్చాయో చూద్దాం!**

అసలు రెండు పార్టీల ఎన్నికల ప్రసంగాల్లోనే మార్పు చాలా కనిపించింది. బీఆర్ఎస్ పార్టీ తమ పార్టీ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించింది. తమ మ్యానిఫెస్టోలో లేనివి కూడా ఎలా అమలు చేశారో చెప్పింది. సంక్షేమం, అభివృద్ధి రెండూ ఎలా సాధించారో వివరించింది. ప్రజలకు సమకూర్చిన వసతులు, వారి చేయూతకు ఇచ్చిన పింఛన్ల వంటివి భవిష్యత్తు తరాలకు ఉపయోగించే విద్య, వైద్యం వంటి సౌకర్యాల గురించి బీఆర్ఎస్ నాయకుల ప్రసంగాలు సాగాయి. అయితే అందుకు పూర్తి భిన్నంగా కాంగ్రెస్ నాయకుల ప్రచారం సాగింది. కండ్లకు కనిపించని విషయాలు–బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అవినీతి అనీ, తాము అమలు చేయబోయే (?) పథకాలు ఆకాశంలో పందిరి వేసినట్టు చెప్పారు. పైగా తమ గత పాలన చూసిన ప్రజలు తమను నమ్మకపోవచ్చని గ్రహించి, ఢిల్లీ అధినాయకులనే కాక, పక్క రాష్ర్టాల అతిరథులని కూడా పిలిపించి ఉపన్యాసాలు ఇప్పించింది హస్తం పార్టీ. ఈ ఆకాశహర్మ్యాలు చూసి కొందరు భ్రమపడి మార్పు చూద్దామని ఆ పార్టీకి ఓట్లేశారు. ఇప్పుడు ఒక్క నెలలోనే చూస్తున్న మార్పులు ఇలా ఉన్నాయి.

పోలీసు వ్యవస్థను బలపరచాలని ముందుగా ఆ కార్యక్రమం తీసుకున్న కేసీఆర్.. స్త్రీల భద్రత కోసం 'షీ టీమ్స్'ని సృష్టించారు. బాలికలు, స్త్రీలను రోడ్ల మీద, బస్టాపుల్లో, బస్సుల్లో ఇబ్బందులు కలిగించే తుంటరులు, పోకిరీల పని పట్టించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో విఫలమైన తమ పథకం 'బస్సుల్లో స్త్రీలకు ఫ్రీ ప్రయాణం' తెలంగాణలో ప్రవేశపెట్టింది. దీనివల్ల ఆడవాళ్లు స్త్రీ శక్తిని చూపుతూ సీట్ల కోసం సిగపట్ల పోరాటం చేస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరగడంతో బస్సుల టైర్లు ఊడిపోవటం, కాలేజీ అబ్బాయిలు లోపల చోటు లేక ఫుట్‌పాత్‌పై నిలబడి, బస్సు వెనుక వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అనుకోని ప్రమాదం జరుగుతుందేమో అన్న భయంతో ఆర్టీసీ సిబ్బందితో పాటు సంస్థ కూడా వణికిపోతున్నది. ఇదివరకు అంటే మిషన్ భగీరథ ద్వారా మంచినీళ్లు రానప్పుడు.. ఆడవారు బోర్ల దగ్గర పోట్లాడుకునే సంఘటనలు చూసేవాళ్లం. కానీ, ఇప్పుడు బస్సుల్లో సీట్ల కోసం చూస్తున్నాం. చంకలోని పిల్లల్ని కూడా సీటు మీద పడేసి ద్వంద్వ యుద్ధాల్లోకి దిగుతున్నారు మహిళలు. కేసీఆర్ స్త్రీ శక్తి గమనించకుండా వారికి రక్షణగా షీటీమ్స్‌ను నియమిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం స్త్రీలు ఏ విషయంలోనూ తీసిపోరని నిరూపిస్తున్నది. మార్పు బాగుంది కదా!

పైగా 'ఎంకి పెండ్లి సుబ్బి సావుకి వచ్చినట్టు' ఫ్రీ బస్ ప్రయాణం ఆటోవాళ్ల ఉపాధిపై దెబ్బకొట్టింది. సాధారణంగా మధ్య, ఎగువ మధ్య తరగతి స్త్రీలు బయటకు వెళ్లినప్పుడు ఆటోలలో ప్రయాణిస్తారు. ఈ మెజారిటీ ఇప్పుడు ఫ్రీ ప్రయాణాలకు ఎగబడటంతో లక్షల ఆటోవాళ్ల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఏ పథకమైనా కేసీఆర్ కిట్‌లా, కల్యాణలక్ష్మి లాగా, బీద విద్యార్థుల విదేశీ విద్యకు సహాయం లాగా కుటుంబమంతా సంతోషించేటట్టు ఉండాలి. కానీ, ఇంకొక వర్గం పొట్ట కొట్టేటట్టు ఉండకూడదు కదా! ఏదేదో ఊహించుకొని కర్ణాటకలో, తెలంగాణలోనూ మహిళలు ఓటేశారు. కానీ, నిజానికి వారికి ఒరిగిందేమీ లేదు. పైగా రోజూ ఆఫీసు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేవాళ్లకు బస్సు ప్రయాణం ఒక నరక సదృశ్యమైపోయింది. మార్పు భలే బాగుంది కదా!

**రైతులకు పెట్టుబడి సాయంగా ఇచ్చే రైతుబంధు కొత్త పథకమేమీ కాదు. కానీ, ఎన్నికలను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఫిర్యాదు వల్లనే రైతులకు సమయానికి పెట్టుబడి సాయం అందలేదు. మరి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కొత్త ప్రభుత్వమైనా ఆ నగదు అందించాలి కదా! అది రాలేదు రైతులకు. కాలం అయిపోతుందని అష్టకష్టాలు పడి పంట వేస్తున్నారు చేతనైనవాళ్లు. లేనివాళ్లు ఊరుకుంటున్నారు. మరి ఇది పెద్ద మార్పే కదా! బాగుందా ఈ మార్పు?**

ఇంక ప్రగతి భవన్ కాస్త ప్రజాభవన్ అయింది. అంటే ప్రగతి పోయి ప్రజలను వారి సంగతి వారినే చూసుకోమని చెప్తున్నారన్న మాట. నాయకుడి పాలనపోయి ప్రజా పాలన వచ్చింది. నిజానికి 1947లో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచీ ప్రజా పాలనే సాగుతున్నది. ఆ పార్టీ నాయకులు ఎప్పుడు పట్టించుకున్నారు ప్రజలను? అధికారులు విధిస్తున్న నిబంధనల ప్రకారం ప్రజలు వారిని వారే పాలించుకుంటున్నారు. కనీసం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించలేదు ఈ ప్రభుత్వాలు. అందుకే పెద్దఎత్తున మేధోవలస జరిగి, జీవితంలో ఏదైనా సాధించాలని ఉత్సాహంతో చదువుకున్న తెలివైనవారు విదేశాలకు తరలిపోయారు. ఇంత జనాభా ఉన్న మన దేశం, ఇన్ని విశ్వవిద్యాలయాలున్న భారతదేశ విద్యాసంస్థలు అంతర్జాతీయ ర్యాంకులలో 100లోపు ఎప్పుడూ సాధించలేదు. ఇది 1947 నుంచీ దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఘనత. బ్రిటిష్ పాలన కింద ఉన్న విద్యాస్థాయి కూడా తర్వాత లేదంటే అది ఆ కాలంలోనే కాంగ్రెస్ సాధించిన మార్పు కదా!

2024 సార్వత్రిక ఎన్నికల దాకా అరకొరగా తాము చెప్పిన పథకాలు సాగినా, తర్వాత అసలైన మార్పు చూస్తారు అమాయక తెలంగాణ ఓటర్లు. అసలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య తేడా ఏమిటో ఈ ప్రజలకు తెలియలేదు, గ్రహించలేదు కాబట్టే అమాయకంగా పథకాల పేర్లు చూసి కాంగ్రెస్‌ను గెలిపించారు. రాష్ట్రం ఏర్పడగానే కేసీఆర్ సకలజనుల సర్వే నిర్వహించి ప్రజల వివరాలన్నీ కుటుంబాల వారీగా సేకరించి, తర్వాతి ప్రణాళికలు అన్నీ ఆయనే రచించారు. ఐదున్నర దశాబ్దాలు కష్టాలు పడ్డ ప్రజలకు – వర్గాల వారీగా– అంటే రైతులు, మహిళలు, ఉద్యోగులు, వృద్ధులు, విద్యార్థులు ఇలా వారి అవసరాలను గుర్తించి ప్రణాళికలు రచించారు. దానికి రాష్ట్రం ఏర్పడకముందే చాలా సభలు పెట్టి, ఆయా రంగాల నిష్ణాతులతో చర్చించాకే పథకాలు రూపొందించారు. అందుకే అవన్నీ అంత విజయవంతంగా సాగాయి. అటు వ్యవసాయంలో రైతులకు, ఇటు పారిశ్రామికవేత్తలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించారు. హడావుడిగా కాంగ్రెస్ వారి లాగా ప్రజలను ఓటర్లుగా చూడకుండా, మనుషులుగా పరిగణించి వారి అవసరాలు తీర్చారు. ఇదే పెద్ద తేడా! మరి ఇప్పటి మార్పు గమనించారా?




ఇప్పుడు చాలామంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నదేమంటే అన్నేండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రతి విషయంలో తడబడుతూ, రోజుకో మాట మారుస్తూ, ప్రజలకిచ్చిన ఒక్క అభ్యర్థనా పత్రంలో అన్ని లోపాలుండటం, డబ్బులు జమచేస్తామని అకౌంట్ నంబర్ అడుగకపోవటం. అసలు అన్ని పథకాలు ఒక్క పత్రంలో, అదీ డిజిటల్ కాకుండా ఒక పేరుతో ఇస్తే మళ్లీ వాటిని వర్గీకరించటానికి ఎంత సమయం కావాలి? ఇవన్నీ చూసి ప్రజలు కాంగ్రెస్ నాయకుల అసమర్థతకు ఆశ్చర్యపోతున్నారు. కానీ, కొద్దిగా లోతుగా 1956 నుంచి 2014 దాకా కాంగ్రెస్ పాలన చూస్తే అసలు విషయం అర్థమవుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 58 ఏండ్ల కాలంలో కాంగ్రెస్ 44 ఏండ్లు, తెలుగుదేశం పార్టీ 14 ఏండ్లు పరిపాలించాయి. ఇరవై ఏడున్నర ఏండ్లు రాయలసీమకు చెందినవారు ముఖ్యమంత్రులుగా, ఇరవై నాలుగున్నర ఏండ్లు ఆంధ్రా ప్రాంతం వారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముగ్గురిని తెలంగాణ నుంచి అనివార్య పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులుగా చేసినా.. వారి పాలనను ఆరేండ్లే సాగనిచ్చారు ఆంధ్రా నాయకులు. ఇక ఇతర ప్రాంతాల వారు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు అన్ని ప్రణాళికలు, అన్ని విధానపరమైన నిర్ణయాలూ ఆ ముఖ్యమంత్రులూ, వారి సహచర వ్యాపారస్థులకు అనుగుణంగా తీసుకొని తెలంగాణ వనరులు దోచుకుంటూ పాలన సాగించారు. 1969 తెలంగాణ ఉద్యమం తర్వాత కూడా మంత్రివర్గంలో ఉన్నా, ఈ తెలంగాణ నాయకులు కూడా అవినీతి సొమ్ములో తమ పది పైసల వాటాతో తృప్తిపడ్డారు కానీ, ఆంధ్రా నాయకులను ప్రశ్నించే ప్రయత్నం చేయలేదు. తెలంగాణ వనరుల దోపిడి కానీ, ప్రజల పట్ల చూపిన వివక్ష గురించి కానీ వారు ఆంధ్రా నాయకులను నిగ్గదీసింది లేదు. నిర్ణయాలన్నీ ఆ ప్రాంతం నాయకులవి గనుక వాటి గురించి వీరు ఆలోచించినదీ లేదు. డాక్టర్ జయశంకర్ సార్ ఎన్నో సభల్లో చెప్పేవారు. 'తెలంగాణ వారు హోంమంత్రిగా ఉన్నా కూడా టోపీ మంత్రికి పెట్టి లాఠీ మాత్రం తన చేతిలో పెట్టుకునేవాడు ముఖ్యమంత్రి' అని. ఇలాగా ఈ తెలంగాణ కాంగ్రెస్ కానీ, తెలుగుదేశం నాయకులకు కానీ ఏ విధానం, ప్రణాళిక, నిర్ణయం కానీ ఎట్లా చేస్తారో తెలియదు. వీళ్లెవరూ వాటిల్లో పాత్ర వహించకపోవటంతో వీరికి ఏ రకమైన పాలనా అనుభవం రాలేదు. బయట ఎక్కడా వీళ్లని మాట్లాడనివ్వకపోవటంతో, రాజకీయ నాయకులు ఎంత హుందాగా మాట్లాడాలో కూడా వీళ్లకి అసలు అవగాహన లేదు. అందుకే ఇప్పుడు అధికారం చేతిలోకి వచ్చినా, వారికి ఒక అప్లికేషన్ ఎలా ఉండాలో కూడా తెలియదు. ప్రజలతో ఎలా మాట్లాడాలో తెలియదు. ప్రతిపక్షాన్ని హుందాగా ఎలా విమర్శించాలో తెలియదు. అందుకే గల్లీ రౌడీల్లా మాట్లాడుతున్నారు.

**ప్రజలకు ఇప్పుడు ఈ మార్పు స్పష్టంగా తెలిసివస్తున్నది. మేధ, ప్రజ్ఞ, తెలివి, నిబద్ధత, ప్రజల పట్ల అపారమైన ప్రేమ, ప్రాంతం పట్ల భక్తి ఉన్న నాయకుడి పాలన, ఈ లక్షణాలేవీ లేకుండా, కేవలం నినాదాలతో అధికారం చేజిక్కించుకున్న అనుభవరాహిత్య నాయకుల పాలనలో తేడా! ఈ మార్పేనా ప్రజలు కోరుకున్నది? పదేండ్ల ముందు ఉన్న అంధకారమేనా వారికి కావాల్సింది?**

ఈ విషయం గురించి బాగా అవగాహన చేసుకొని తెలంగాణ ప్రజలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లోనైనా తమ పట్ల ప్రేమ ఉన్న నిజమైన నాయకుడు కేసీఆర్‌ని, మిగతా బీఆర్ఎస్ సభ్యులను అత్యధిక మెజారిటీ ఓట్లతో ఎన్నుకొని పార్లమెంట్‌కు పంపిస్తే తెలంగాణ వాణిని కనీసం ఢిల్లీలోనైనా వినిపించటానికి వీలవుతుంది. లేకపోతే రాష్ట్రంలో, కేంద్రంలో తెలంగాణ గొంతు మూగబోతుంది. 1956 నుంచి 2014 దాకా పడ్డ కష్టాలే మళ్లీ పడాల్సి ఉంటుంది. జాగ్రత్తగా, తెలివిగా ఆలోచించండి. దొరలు వద్దని సిద్ధాంతం పెట్టుకొని దొంగలను ఎన్నుకోకండి. నాయకులకు పాలనానుభవం చాలా ముఖ్యం. ఆలోచించండి, జాగ్రత్తగా ఓటు వేయండి.

---

# చెరిపేస్తే చెరిగిపోయేదా చరిత్ర?



తెలంగాణ విజయ్
94919 98702

**'తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు' అంటూ వేమన శతకంలో ఒక పద్యం ఉంటుంది. ఇతరుల్లో తప్పులు వెతికే వారు, తమ తప్పులను తెలుసుకోలేరని ఆ పద్య భావం. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తీరు అచ్చం అలాగే ఉన్నది. 64 సీట్లతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ప్రజలు కోటి ఆశలతో ఆ పార్టీకి పట్టం గట్టారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను అమలుచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. ఆరు గ్యారంటీల అమలును పక్కదారి పట్టిస్తూ గత పదేండ్లుగా పాలన సాగించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై అవాకులు, చెవాకులు పేలుతున్నది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల పేరుతో కాలాన్ని వృథా చేస్తున్నది. పదేండ్లుగా బీఆర్ఎస్ ఏ అభివృద్ధీ చేయలేదంటూ, పైగా అప్పులు చేసిందంటూ విష ప్రచారం చేస్తున్నది. కాంగ్రెస్ అబద్ధాలను రాష్ట్ర ప్రజలు నమ్ముతారా అంటే లేదనే చెప్పాలి.**

ఇదిలా ఉంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ అంతరించిపోయినట్టు కాంగ్రెస్ పార్టీ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది. ఇప్పుడున్న కాంగ్రెస్ మంత్రుల్లో అందరూ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్/ బీఆర్ఎస్ దెబ్బను రుచిచూసినోళ్లే. కాంగ్రెస్ పార్టీ గెలిచింది 64 సీట్లు, బీఆర్ఎస్ గెలిచింది 39 సీట్లు. గెలిచిన స్థానాల్లో 5 వేల లోపు వ్యత్యాసం ఉన్నవే ఎక్కువ. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 2 శాతం కన్నా తక్కువే అనే విషయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గుర్తుపెట్టుకోవాలి. బీఆర్ఎస్ మరో 20 మంది అభ్యర్థులను మార్చితే కాంగ్రెస్ పరిస్థితి వేరేలా ఉండేది. ఇది గ్రహించని కాంగ్రెస్ మంత్రులు ఇక బీఆర్ఎస్ పనైపోయిందనుకొని భ్రమపడుతూ బీఆర్ఎస్‌పై అబద్ధాలు మోపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తుండటం విడ్డూరం.

ఒకసారి చరిత్రను వెలికితీద్దాం. 2004–2009 మధ్య ఉద్యమ పార్టీ టీఆర్ఎస్‌ను, తెలంగాణ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు నాటి సీఎం వైఎస్సార్ 'ఆపరేషన్ ఆకర్ష్' పేరుతో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లాక్కున్నారు. ఉద్యమంలో అదొక కుదుపు అనే చెప్పవచ్చు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ దెబ్బతిన్నది. అప్పుడే 'ఇక టీఆర్ఎస్ పనైపోయింది' అనుకున్నారంతా. ఉద్యమంతో పాటు టీఆర్ఎస్ అంతమైపోతుందని గేలి చేశారంతా. అలా వెకిలి చేసినవాళ్లు కనుమరుగైపోయారు కానీ, అదే టీఆర్ఎస్ రెట్టించిన ఉత్సాహంతో తెలంగాణను సాధించింది. రాష్ట్రంలో రెండుసార్లు అధికారాన్ని చేపట్టింది. అదీ కేసీఆర్ చాణక్యం. అదీ కేసీఆర్ వ్యూహం. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమంలో ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసింది.



పడిన ప్రతీసారి నేలకు కొట్టిన బంతిలా పైకి ఎగిరిందే తప్ప భూమిలో చిక్కుకోలేదు. స్వరాష్ట్ర ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వం, టీఆర్ఎస్ పనితీరు ప్రజల కండ్లల్లో ఇప్పటికీ మెదులుతూనే ఉంటుంది. కేసీఆర్ అలుపెరగని ఉద్యమ ప్రస్థానాన్ని, బీఆర్ఎస్ పోరాటాన్ని చెరిపేస్తే చెరిగిపోయేది కాదు. ఒక్క ఓటమితో బీఆర్ఎస్‌ను కుంగదీయాలనుకుంటే అది అత్యాశే అవుతుంది. కొన్ని స్వీయ తప్పిదాలు, ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకత, క్షేత్రస్థాయి నాయకత్వంలో ఉన్న గ్రూపు తగాదాలు వెరసి బీఆర్ఎస్ ఓటమి పాలైంది తప్ప, ఇది కాంగ్రెస్ విజయమో లేక ఏ ఒక్క వ్యక్తి విజయమో కాదు. ఓటమి చెందిన ప్రతీసారి తమ తప్పులను సమీక్షించుకొని బీఆర్ఎస్ పార్టీ ముందుకు కదిలింది, విజయం సాధించింది. ఇకముందూ అదే జరుగుతుంది. అలుపెరగని పోరాట, అభివృద్ధి ప్రస్థానానికి ఇదొక కామా మాత్రమే. ఫుల్‌స్టాప్ కాదు, కాబోదు.

ఇక గత పదేండ్లుగా తెలంగాణలో జరిగిన అభివృద్ధి విషయానికి వద్దాం. మంత్రులు వరుస ప్రజెంటేషన్లు ఇస్తున్నారు. అసెంబ్లీలో అప్పులపై ప్రజెంటేషన్ ఇవ్వబోయి బొక్కబోర్లా పడ్డారు. బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సమాధానాలతో ప్రజెంటేషన్ ఫెయిల్యూర్‌గా మిగిలింది. పనిగట్టుకొని బీఆర్ఎస్‌కు మైలేజీ ఇచ్చామని కాంగ్రెస్ నాయకులే నాలిక్కరుచుకోవడం హాస్యాస్పదం. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లలో అప్పులు తీసుకుని ఆటలు ఆడలేదు. ప్రజల ఆస్తులను పెంచింది, రాష్ట్ర స్థాయిని ఆకాశానికి తీసుకువెళ్లింది. దేశంలో తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దింది. పదేండ్లలో వందేండ్ల ప్రగతిని సాధించింది. సంపదను పెంచి పేదలకు పంచింది. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ప్రజల కండ్లముందున్న అభివృద్ధి సాక్ష్యాలను ఎలా చెరిపేయగలదు? మిషన్ కాకతీయతో బాగుపడ్డ చెరువులను ఎలా మరిపించగలదు? లక్షలాది ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం వంటి ప్రాజెక్టును ఒక్క విజిట్‌తో చెరిపేయగలదా? కాంగ్రెస్ పాలనలో పట్టించుకోకుండా వదిలేసిన యాదాద్రి నరసన్న దైవక్షేత్రం నేడు అద్భుతమైన హంగులతో నిత్యం ప్రజలతో విరాజిల్లుతున్నది. ఈ చరిత్రను ఎవరు, ఎలా చెరిపేయగలరు?

ఒక్క ఓటమితో బీఆర్ఎస్‌కు వచ్చే నష్టమేమీ లేదు. ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాల చరిత్ర కలిగిన బీఆర్ఎస్ పార్టీ కొద్దిరోజుల్లో రెట్టించిన ఉత్సాహంతో ప్రజల ముందుకువస్తుంది. 'వ్యక్తులపై కోపంతో కేసీఆర్‌ను కోల్పోయామ'ని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే పశ్చాత్తాపపడుతున్నారు. క్షేత్రస్థాయిలో తిరిగే నాలాంటి వాళ్లెవరినడిగినా ఇదే మాట చెప్తారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మంచి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ చేయవలసిందల్లా కార్యకర్తలకు తామున్నామనే భరోసా ఇవ్వటం, పార్టీని పునర్నిర్మించడం. తెలంగాణ పునర్నిర్మాణ క్రమంలో పార్టీని కొంత నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవం. అయినా, ప్రజా తీర్పును బీఆర్ఎస్ పార్టీ గౌరవిస్తున్నది. ఇక పార్టీని బలంగా పునర్నిర్మిస్తూ ప్రజల్లోకి వెళ్లటం, విజయం సాధించడమే మిగిలి ఉంది. కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ మళ్లీ తిరుగులేని అజేయశక్తిగా ముందుకు వస్తుంది. మళ్లీ అధికారం చేపడుతుంది. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష. గత పదేండ్ల కేసీఆర్ పనితీరును చెరిపేయాలని చూస్తే అది కాంగ్రెస్ నాయకుల అత్యాశే అవుతుంది.

---



# ఉల్ఫా 'శాంతి'ంచినట్టేనా?

**ఈశాన్య రాష్ట్రమైన అస్సాం చరిత్రలో కీలక పరిణామం చోటుచేసుకున్నది. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (యూఎల్ఎఫ్ఏ–ఉల్ఫా), కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఉల్ఫా తీవ్రవాదులు ఆయుధాలను వదిలేసి జనజీవన స్రవంతిలో కలిసిపోయి ఈశాన్య భారతంలో శాంతిభద్రతల స్థాపనకు సహకరించాలి. ఈ ఒప్పందాన్ని అతిపెద్ద విజయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పుకొన్నారు. చర్చలకు అనుకూలంగా ఉన్న అరబింద రాజ్‌ఖోవా వర్గం మాత్రమే దీనిపై సంతకం చేసిందన్న విషయాన్ని మరిచిపోకూడదు. పరేశ్ బారువా నేతృత్వంలోని ఉల్ఫా–ఇండిపెండెంట్ వర్గం ఇంకా ఉనికిలోనే ఉందన్న విషయాన్ని గుర్తెరగాలి. అయితే ఏదేమైనప్పటికీ ఈశాన్య భారత్‌లో శాంతి దిశగా ముందడుగు పడిందనే చెప్పాలి.**

ఉల్ఫా తీవ్రవాదం అనేది ఒక్క అస్సాం రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. మొత్తం ఈశాన్య భారతంపై దీని ప్రభావం ఉన్నది. సార్వభౌమాధికార అస్సాం లక్ష్యంగా 1979లో ఏర్పాటైన ఉల్ఫా ఒకానొక సమయంలో ఈశాన్య భారత్‌తో పాటు ఆ చుట్టుపక్కల దేశాల్లోనూ కార్యకలాపాలను నిర్వహించింది. మయన్మార్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్‌లో శిబిరాలతో అప్పట్లో ఉల్ఫా ఓ వెలుగు వెలిగింది. అయితే శ్రీలంకలో లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) పతనం, భూటాన్‌లోని శిబిరాలను తొలగించాలని ఆ దేశంపై ఒత్తిళ్లు, బంగ్లాదేశ్‌లో భారత్‌కు అనుకూలంగా వ్యవహరించే షేక్ హసీనా ప్రభుత్వం రాకతో ఉల్ఫాకు గడ్డు పరిస్థితులు ప్రారంభమయ్యాయి. ఏండ్ల పాటు జరిగిన అణచివేత కారణంగా ఉల్ఫా క్రమంగా పట్టు కోల్పోయింది. దీంతో శాంతి చర్చల దిశగా అడుగులు వేయకతప్పలేదు. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావుతో ఆరుగురు ఉల్ఫా ప్రతినిధుల బృందం చర్చలను ప్రారంభించింది. అయితే వీటిని ఉల్ఫా జనరల్ కౌన్సిల్ తిరస్కరించడంతో అప్పట్లో జరిగిన చర్చలు అటకెక్కాయి. అనంతరం 2005, 2008, 2011లోనూ పలుమార్లు చర్చలు జరిగాయి. అయితే రాజ్‌ఖోవా నేతృత్వంలో 2012లో మొదలై.. 12 ఏండ్ల పాటు సాగిన సుదీర్ఘ చర్చల పర్వం ఓ కొలిక్కి రావడంతో తాజాగా శాంతి ఒప్పందం కుదిరింది. ఈ చర్చలను వ్యతిరేకించిన పరేశ్ బారువా ఉల్ఫా–(ఇండిపెండెంట్) పేరిట సొంత కుంపటి పెట్టుకున్న విషయం తెలిసిందే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు– ఉల్ఫా మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించడం, శిబిరాల రద్దు, ఉల్ఫా తీవ్రవాదులకు నగదు చెల్లింపులు తదితర అంశాలున్నాయి. రాష్ట్ర అభివృద్ధికి స్పెషల్ ప్యాకేజ్, ఐఐఎం ఏర్పాటు, రైలు తయారీ కర్మాగారం, అంతర్జాతీయ కల్చరల్ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్సులు, రోడ్డు కనెక్టివిటీ తదితర ప్రాజెక్టులు చేపట్టాలని శాంతి ఒప్పందంలో ఉన్నది.


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఒప్పందాన్ని గొప్పగా అభివర్ణిస్తున్నప్పటికీ.. దీనిపై విమర్శలు వస్తున్నాయి. ఓవైపు ప్రతిపక్షాలు, మరోవైపు సోషల్‌మీడియా వేదికగా సామాన్యులు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వం దీన్ని తెర పైకి తీసుకొచ్చిందని ప్రతిపక్షాలు అంటున్నాయి. మణిపూర్ అల్లర్ల కారణంగా ఈశాన్యంలో ప్రభ కోల్పోయిన బీజేపీ.. ఏదో సాధించామని చెప్పుకోవడానికి శాంతి ఒప్పందాన్ని మమ అనిపించిందనే విమర్శలూ ఉన్నాయి. ఒప్పందంలో చేర్చిన పలు అంశాలను కూడా వారు లేవనెత్తుతున్నారు. అస్సాం అభివృద్ధికి పలు ప్రాజెక్టుల కేటాయింపును ఒప్పందంలో చేర్చటాన్ని ప్రతిపక్ష నేతలు తప్పుబడుతున్నారు. 'మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. దాని కోసం ఒప్పందం చేసుకోవాలా?' అని ప్రతిపక్షాలతో పాటు సోషల్ మీడియాలోనూ విమర్శలు వస్తున్నాయి. ఓబీసీలోని పలు సామాజికవర్గాలకు ఎస్టీ హోదా కల్పించే హామీని ఇందులో చేర్చకపోవడాన్ని విపక్ష కాంగ్రెస్ నేత దేబబ్రత సైకియా గుర్తుచేశారు. ఎన్ఆర్‌సీ గురించి అందులో ప్రస్తావించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ విమర్శల కారణంగానే ఉల్ఫా నేతలు ఒప్పందం అనంతరం మీడియా ముందుకొచ్చి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

**ఈశాన్య భారతం మొదటి నుంచి ఒప్పందాలకు వేదిక. ఈ ప్రాంతంలో అనేక ఒప్పందాలు జరిగినప్పటికీ మిజో, బోడో ఒప్పందాలు మాత్రమే పూర్తి స్థాయిలో విజయవంతమయ్యాయి. తాజాగా జరిగిన ఒప్పందం ప్రభావం మిగతా గ్రూపులపై కూడా పడుతుంది. సాధారణంగా ఏదైనా ఒప్పందం జరిగినప్పుడు.. దాన్ని వ్యతిరేకిస్తున్న వర్గం విడిపోయి మరో కుంపటి పెట్టుకోవటం సహజం. ఈ సమయంలో వారు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని కోరుకుంటారు. ఇక్కడ కూడా అదే జరిగే అవకాశం లేకపోలేదు.**

ప్రస్తుత ఒప్పందాన్ని సరైన రీతిలో అమలు చేయకపోతే.. మళ్లీ ఉల్ఫా తీవ్రవాదులు ఆయుధాలు చేపట్టే ప్రమాదం ఉన్నది. ఒప్పందంలోని డిమాండ్ల అమలును పర్యవేక్షించేందుకు ఓ కమిటీని నియమిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పినప్పటికీ, అది అనుకున్నంత సులువు కాదనే చెప్పాలి. ఎందుకంటే ఒప్పందం చేసుకున్నంత సులువు కాదు, దాన్ని అమలు చేయడం. కేంద్ర, రాష్ట్ర పాలకులు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. పైగా సార్వత్రిక ఎన్నికల వేళ పురుడుపోసుకున్న ఈ ఒప్పందంలోని అంశాలను ఆ తర్వాత పక్కనపెడితే.. సమస్య మళ్లీ మొదటికొస్తుంది. పరేశ్ బారువా నేతృత్వంలోని మరో వర్గం ఇంకా ఉనికిలోనే ఉన్నది. మయన్మార్‌లో శిబిరాలు నిర్వహిస్తున్న ఆ వర్గం తమ ఆధిపత్యాన్ని చాటేందుకు ప్రయత్నించే అవకాశం ఉన్నది. రాజకీయ లబ్ధి కోసమే ఒప్పందం జరిగిందా? అనే అనుమానాలు అందరి మదిని తొలుస్తున్న వేళ.. అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఈశాన్య భారత దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఉన్నది.


– ఎడిటోరియల్ డెస్క్

---




## కశ్మీర్‌పై ప్రాథమిక తప్పిదం

*1948లో కశ్మీర్ అంశాన్ని ఐరాస భద్రతా మండలికి తీసుకెళ్లడం అప్పటి పాలకులు చేసిన ప్రాథమిక తప్పిదమని 1970ల్లోనే తేలిపోయింది. నాడు భద్రతా మండలిలో ఉన్నవారంతా భారత వ్యతిరేకులే. ఎందుకంటే, పాశ్చాత్య దేశాలు పాకిస్థాన్ పట్ల పక్షపాత వైఖరిని కలిగి ఉంటాయి. ఆర్టికల్-370 రద్దు ద్వారా దుర్బలత్వపు కిటికీని భారత్ మూసివేసింది.*



– జైశంకర్, విదేశాంగ శాఖ మంత్రి